



# కరపత్రం

SINCE 2014

శనివారం జూన్ 28 2025 | సంపుటి :0 | సంచిక :253 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## ఈ నెల 29న నిజామాబాద్‌కు అమిత్ షా



నిజామాబాద్:
ఈ నెల 29న కేంద్రమంత్రి అమిత్ షా నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. నిజామాబాద్‌లోని పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించనున్నారు. ఈ నెల 29న మధ్యాహ్నం ఒంటిగంటకు బేగంపేట విమానాశ్రయం చేరుకోనున్నారు. అక్కడి నుంచి నిజామాబాద్ పసుపు బోర్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు. దీని కోసం భాజపా విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.



## గోదావరి నదిపై ప్రాజెక్ట్ కడితే బనకచర్ల వివాదం ఉండేది కాదు: మంత్రి ఉత్తం


సూర్యాపేట
సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలో పర్యటించారు మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి. మండలంలోని జాన్ పహాడ్ ఎత్తిపోతల పథకం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు ఉత్తం కుమార్ రెడ్డి. జాన్ పహాడ్ ఎత్తిపోతల పథకానికి జాన్ పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ గా నామకరణం చేశామని అన్నారు. ఈ పథకం కి మూడు వందల కోట్ల రూపాయలు మంజూరు చేసామని.. ఈ ప్రాజెక్ట్ ద్వారా పది వేల ఎకరాలు సాగు అవుతుందని అన్నారు. గోదావరి నదిపై ప్రాజెక్టు కట్టి ఉంటే బనకచర్ల వివాదం ఉండేది కాదని అన్నారు మంత్రి ఉత్తం.

2లో..

# పివి సంస్కరణలే దేశాన్ని బలోపేతం చేశాయి

## - జయంతి సందర్భంగా స్మరించుకున్న సిఎం రేవంత్





హైదరాబాద్,జూన్27:
మాజీ ప్రధానమంత్రి, బహుభాషా కోవిదుడు, రచయిత, ఆర్థిక సంస్కరణల పితామహుడు, భారతరత్న పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మరించుకున్నారు. ప్రధానిగా విప్లవాత్మక సంస్కరణలు తీసుకువచ్చి దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలోనూ, అన్ని రంగాల్లో ఆర్థిక సంస్కరణలతో దేశ ప్రగతిని పరుగులు పెట్టించిన ఘనత పీవీ నరసింహారావుకు దక్కుతుందని ముఖ్యమంత్రి కొనియాడారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నాడు పీవీ చేపట్టిన ఆర్థిక సంస్కరణలే నేడు భారత్ 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగేందుకు దోహదపడుతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. విద్యా వ్యవస్థలో వినూత్న విధానాలు ప్రవేశ పెట్టారని, నవోదయ విద్యాలయాలు పీవీ హయాంలోనే ఏర్పాటు చేశారని గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిగా సర్వేల్ రెసిడెన్షియల్ స్కూల్ నెలకొల్పి గురుకుల విద్యకు తొలి అడుగులు వేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. ఖవీ స్ఫూర్తితోనే రాష్ట్ర విద్యా వ్యవస్థలో సమూల ప్రక్షాళనకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతో పాటు, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి ప్రజా ప్రభుత్వం సంకల్పించిందని వ్యాఖ్యానించారు. అన్ని వర్గాల విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్య అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



## అంతర్జాతీయ ఆర్బిట్రేషన్‌కు భూ కేటాయింపులు రద్దు చేసిన హైకోర్టు

హైదరాబాద్:
అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్ (ఐఏఎంసీ)కు చేసిన భూ కేటాయింపులను హైకోర్టు రద్దు చేసింది. శేరిలింగంపల్లి మండలం రాయదుర్గంలోని సర్వే నెంబరు 83/1లో 3.5 ఎకరాలకు పైగా భూమిని కేటాయిస్తూ జారీ చేసిన జీఓను హైకోర్టు కొట్టేసింది.



## నేను ఫోన్ ట్యాపింగ్ బాధితుడ్ని..నన్ను విచారణకు పిలవండి: ఎంపీ రఘునందన్ రావు

హైదరాబాద్:
ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై బీజేపీ ఎంపీ రఘునంద న్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కేసులో సిట్ విచారణ ఎటు పోతుందో అర్థం కావడం లేదన్నారు. తాను దుబ్బాక ఉప ఎన్నికల టైమ్ లోనే తన ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ఫిర్యాదు ఇచ్చానని, కానీ ఇప్పటివరకూ తనను సిట్ విచారణకు పిలవలేదన్నారు. కానీ ఈ కేసుకు సంబంధం లేని కాంగ్రెస్ నేతలను విచారణకు పిలుస్తున్నారన్నారంటూ అసహనం వ్యక్తం చేశారు.

2లో..



## హైదరాబాద్ లో ఒక్క నెలలోనే ఇన్ని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులా..

### - 3 వేల మందికి పైగా దొరికిపోయారు..

## నిన్న జూరాల.. నేడు మంజీర

» సర్కార్ అసమర్థతకు నిదర్శనం
» మాజీమంత్రి కెటిఆర్ విమర్శలు



హైదరాబాద్,జూన్27:
జంటనగరాలకు మంచినీరు అందించే మంజీరా బ్యారేజీని కూడా ప్రమాదంలో పడేయడం అత్యంత ఆందోళనకరం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ సర్కారు చేతకానితనంతో జూరాల ప్రాజెక్టును డేంజర్‌లోకి నెట్టిన సంఘటనకు 24 గంటలు గడవకముందే ఈ ఘటన చోటు చేసుకోవడం అసమర్థ పాలనకు నిదర్శనమని అన్నారు.

2లో..



## ఆదివాసీల సంక్షేమంలో రాజీలేదు మావోయిస్టుల లేఖపై స్పందించిన సీతక్క

ములుగు,జూన్27:
ఆదివాసీల ప ట్ల తన చిత్తశుద్ధిని శంకించాల్సిన పనిలేదని మంత్రి సీతక్క అన్నారు. ఆదివాసీల జోలికి వెళ్లవద్దని అటవీశాఖ అధికారులకు మంత్రి కొండా సురేఖతోపాటు తానూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు.ఆదివాసీల వ్యవహారంలో మావోయిస్టులు తనకు సంధించిన లేఖపై తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క స్పందించారు.

## 142 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలు

- వీరి సమస్యలపై చిత్తశుద్ధి లేని ప్రభుత్వం
- మాజీమంత్రి హరీష్ రావు విమర్శ



సంగారెడ్డి,జూన్27:
ఆటో కార్మికుల కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. పటాన్‌చెరువు ఆటో డ్రైవర్ల సంఘం ప్రతినిధులు శుక్రవారం హరీష్‌రావును కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తమ జీవితాలు దయనీయంగా మారాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి తమను మోసం చేశారని వారు ఆవేదన వ్యక్తంచేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాడాలని వారు కోరారు. సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 18 నెలల వ్యవధిలో 142 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. అవి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని మండపడ్డారు. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12,000 భృతి ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశారని, ఇప్పుడు ఆటో కార్మికుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు.

02

## ఇందిరమ్మ ఇళ్ల విషయంలో దళితులకు అన్యాయం

- ఇలాంటి వివక్ష గతంలో ఎప్పుడూ చూడలేదు
- బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ విమర్శలు



హైదరాబాద్,జూన్27:
ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విషయంలో దళితుల పట్ల చూపిస్తున్న వివక్ష ఆర్ఎస్పీ మండిపడ్డారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు. మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లికి చెందిన నక్క సనా, వేణు దంపతులకు ఇందిరమ్మ ఇల్లు ప్రొసీడింగ్‌ను ఆపేసిన ఘటనపై ఆర్ఎస్పీ తీవ్రంగా స్పందించారు. అంటే మీ ఏఐ లాంగ్వేజ్ మోడల్‌లో వాట్సాప్‌లో బీఆర్ఎస్ స్టాటస్ పెట్టుకుంటే, ఎస్సీలైతే ఇందిరమ్మ ఇల్లు ఇవ్వనవసరం లేదని షరతులు విధించి ప్రోగ్రాం తయారు చేసింర్రన్న మాట! మరీ ఇంత చిల్లర పాలనా? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజమెత్తారు.

02

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం జూన్ 28 2025

# సంపాదకీయం

## దారి మరిచిన ఎస్‌సీవో!

ఆర్భాటంగా ఏర్పడటం, ఘనంగా లక్ష్యాలు చాటుకోవటం, కీలక సమయాల్లో మొహం చాటేయటం ప్రాంతీయ సహకార సంస్థలకు అలవాటుగా మారింది. సంక్షుభిత ప్రపంచంలో సమస్యలు రావటం సహజమే అయినా, దేశాల మధ్య తలెత్తే విభేదాలు అలాంటి సంస్థల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఆ సంస్థల వల్ల ఉద్రిక్తతలు ఉపశమిస్తాయనుకోవటం అమాయకత్వమని రుజువు చేస్తున్నాయి. సరిగ్గా 24 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) అవస్థ అలాగే ఉంది.ఆ సంస్థ రక్షణ మంత్రుల స్థాయి శిఖరాగ్ర సదస్సు రెండు రోజులు జరిగి గురువారం చైనాలోని చింగ్‌దావ్‌లో ముగిశాక విడుదల కావాల్సిన ఉమ్మడి ప్రకటన భారత్ కారణంగా మూలన పడింది. ఆ ప్రకటనపై సంతకం చేసేందుకు మన రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ నిరాకరించటంతో చేసేదేమీ లేక ఉమ్మడి ప్రకటన ఆలోచనే విరమించుకున్నారు. ఈ సదస్సుకు మన దేశంతోపాటు చైనా, రష్యా, పాకిస్తాన్, ఇరాన్, కిర్గిజ్ రిపబ్లిక్, కజఖ్‌స్తాన్ తదితర దేశాల రక్షణమంత్రులు హాజర య్యారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనటం ఎలా అనే అంశంపై సదస్సు జరిగింది.ఎస్‌సీవో 2001లో షాంఘైలో ఏర్పడినప్పుడు అది అందరిలో ఆశలు రేకెత్తించింది. ఎందుకంటే మధ్య ఆసియా దేశాల భద్రత, అభివృద్ధిపైనే ప్రధానంగా కేంద్రీకరిస్తామని సంస్థ తెలిపింది. భారత్, చైనాల మధ్య ఏనాటి నుంచో సరిహద్దు వివాదాలున్నాయి. ఇక పాకిస్తాన్ నాలుగు దశా బ్దాలుగా సరిహద్దు చొరబాట్లను ప్రేరేపిస్తూ ఉగ్రవాద ఘటనలకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో ఎస్‌సీవో వల్ల చైనా, పాక్‌లతో ఉన్న సమస్యలకు ఒక పరిష్కారం దొరుకుతుందన్న ఆశ ఉండేది. 2005 నుంచి మన దేశం పరిశీలక హోదాలో సదస్సులకు హాజరవుతూ వచ్చింది. 2017లో రష్యా అధినేత పుతిన్ చొరవతో భారత్ పూర్తి స్థాయి సభ్యదేశమైంది. కానీ, సభ్య దేశాల వ్యవహార శైలి దేని దారి దానిదే! ఎస్‌సీవో స్థాపనలో కీలక పాత్ర పోషించిన చైనాయే 2020 జూన్‌లో వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ)వద్ద చొరబాటు యత్నం చేసింది. చైనా సైన్యం రాళ్లతో, కర్రలతో, రాడ్లతో దాడి చేసి 21 మంది మన జవాన్ల ప్రాణాలు తీసింది. అంతకుముందూ, ఆ తర్వాతా చైనా తీరు అదే.తాజా శిఖరాగ్ర సదస్సులో విభేదాలకు దారితీసిన అంశం ఆశ్చర్యం కలిగిస్తుంది. మొన్న మార్చిలో పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) మిలిటెంట్లు జాఫర్ ఎక్స్‌ప్రెస్ రైలును హైజాక్ చేసి పలువురు పాక్ సైనికులను హతమార్చారు. పాక్ సైన్యం కూడా ప్రతీకార దాడికి దిగి ఆ ఘటనలో పాల్గొన్న మిలిటెంట్లలో అత్యధికుల్ని కాల్చిచంపింది. ఆ మరుసటి నెలలో కశ్మీర్‌లోని పెహల్‌గామ్‌లో పాక్ నుంచి వచ్చిన ఉగ్రవాదులు నిరాయుధులైన పర్యాటకులపై దాడి చేసి 26 మందిని పొట్టనబెట్టుకున్నారు. ఈ రెండు దాడుల్లో కేవలం బలూచిస్తాన్ ఘటనను ఉమ్మడి ముసాయిదా ప్రకటన ప్రస్తావించి పెహల్‌గామ్‌ను మినహాయించింది. ఆ ఉదంతం తర్వాత మన దేశం 'ఆపరేషన్ సిందూర్' పేరిట పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై దాడి చేయటం, పాక్ సైన్యం దాడుల్ని తిప్పికొట్టడానికి వారి వైమానిక స్థావరాలను ధ్వంసం చేయటం పతాక శీర్షికలకెక్కాయి. ఆ ఘటనల పరంపర జరిగి నిండా నెల్లాళ్లు కాకుండానే ఎస్‌సీవో ఎలా మరిచి పోతుంది? చైనా, పాక్‌ల మధ్య సాన్నిహిత్యం ఉంది గనుక ఆ దేశం చెప్పి నట్టల్లా ఆడి ఉమ్మడి ప్రకటన రూపొందించటం, దానిపై మన దేశం సంతకం చేయాలని కోరుకోవటం తెలివితక్కువతనం కాదా? అసలు ఇలాంటి తీరుతెన్నులు సమష్టి తత్వాన్ని దెబ్బ తీస్తాయన్న స్పృహ ఉండొద్దా?ఎస్‌సీవో స్థాపించిన కాలంకన్నా ఇప్పుడు ప్రాంతీయంగా సవాళ్లు ఎన్నో రెట్లు పెరిగాయి. ఉగ్రవాదం వల్ల ఈ ప్రాంత శాంతికీ, భద్రతకూ ముప్పు ఏర్పడుతోంది. దేశాల మధ్య పరస్పరం అవిశ్వాసం కూడా గతంతో పోలిస్తే ఎంతగానో పెరిగింది. ఈ సమయంలో ఎస్‌సీవో వంటి సంస్థ ఈ సమస్యలకు అర్థవంతమైన పరిష్కారం ఆలోచించాలి. కానీ జరిగిందంతా వేరు. ఈ సదస్సులో ప్రసంగించిన రాజ్‌నాథ్ సింగ్ అన్నట్టు రాజ్యేతర శక్తుల వల్లా, ఉగ్రవాద ముఠాల వల్లా ప్రమాద కరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటి వెనకున్న దేశాలు ఆ పరిస్థితుల పర్యవసానాలను ఎదుర్కొని తీరాలని కూడా ఆయన అన్నారు. రాజ్‌నాథ్ ప్రసంగంలో పెహల్‌గామ్, 'ఆపరేషన్ సిందూర్' ప్రస్తావనకొచ్చాయి. అయినా ముసాయిదా ప్రకటన వాటిని మరిచినట్టు నటించింది.ఎస్‌సీవోను సభ్యదేశాలు తమ స్వప్రయోజనాలకు ఉపయోగించుకోవాలని చూస్తున్నాయి తప్ప సమష్టిగా అడుగులేయాలన్న సంకల్పం ప్రదర్శించటం లేదు. ఈ సంస్థ చాటున తన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బీఆర్ఐ)నూ, పలుకుబడినీ పెంచుకోవటమే చైనా ఎజెండా. సంస్థను మధ్య ఆసియా దేశాలకు మించి విస్తరింప జేయాలన్న ఉద్దేశంలోని ఆంతర్యం కూడా అదే. ఇక రష్యాకు ప్రధానంగా పాశ్చాత్య దేశాలతో లడాయి ఉంది. వాటిని ఎదుర్కొనటానికి సంస్థ ఎంతో కొంత తోడ్పడుతుందన్న ఆశ ఉంది. ఎస్‌సీవోను చిత్తశుద్ధితో నిర్వహిస్తే ఈ ప్రాంత దేశాలకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఎస్‌సీవో వాటా 23 శాతం. ప్రపంచ జనాభాలో వాటా 42 శాతం.సంస్థ పెట్టినప్పుడు సభ్య దేశాలమధ్య సైనిక సహకారం, నిఘా నివేదికల్ని పంచుకోవటం, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనటం, విద్య, ఇంధనం, రవాణా రంగాల్లో సహకరించుకోవటం వంటి ఉద్దేశాలున్నాయి. కానీ ఇవన్నీ మరిచి ముఠాలు కట్టి నచ్చినవారికి అనుకూలంగా వ్యవహరించదల్చుకుంటే ఇలాంటి సంస్థలెందుకు? ఈ గంభీరమైన లక్ష్య ప్రకటనలెందుకు? అందుకే ఎస్‌సీవో తీరు మారాలి.

# నిన్న జూరాల.. నేడు మంజీర

మొదటిపేజీ తరువాయి

సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ, పర్యవేక్షణలో సీఎం రేవంత్ ఘోర వైఫల్యం వల్లే వరుసగా నిన్న జూరాల ప్రాజెక్టుకు, నేడు మంజీరా బ్యారేజీకి డేంజర్ బెల్స్ మోగుతున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు.స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్డీఎస్ఓ) నిపుణుల బృందం గత మార్చి 22న బ్యారేజీని సందర్శించి సమర్పించిన నివేదికను ప్రభుత్వం నిర్లక్ష్యంగా పక్కనపెట్టడం క్షమించరాని నేరం. మేడిగడ్డ బ్యారేజీ వద్ద కూడా చరిత్రలో లేనంత వరద రావడంతో రెండు పిల్లర్లకు పగుళ్లు వచ్చిన తరహాలోనే, ఇప్పుడు మంజీరాపై కూడా వరద ఒత్తిడి పెరిగి దిగువ భాగంలో పిల్లర్లకు పగుళ్లు రావడం, ఆఫ్రాన్ కొట్టుకుపోవడం, స్పెల్ వేలోని భాగాలు కూడా దెబ్బతిన్నట్టు ఎస్డీఎస్ఏ నివేదిక గుర్తించినా ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడకపోవడం మరో దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు. నిన్నటిదాకా ఎన్డీఎస్ఏ నివేదిక చెప్పినా మేడిగడ్డ బ్యారేజీని రిపేర్ చేయక పోవడం, నేడు ఎస్డీఎస్ఓ నివేదిక అందినప్పటికీ మంజీరా బ్యారేజీ మరమ్మత్తులు చేపట్టకపోవడం.. ఈ కాంగ్రెస్ సర్కారు అలసత్వానికే కాదు.. దుర్మార్గపు వైఖరికి ప్రత్యక్ష నిదర్శనం అని నిప్పులు చెరిగారు కేటీఆర్. రానున్న రోజుల్లో పైనుంచి మంజీరాలో వరద ఉధృతి పెరిగితే మరింత కోతకు గురై చివరికి డ్యామ్‌ను కూడా ప్రమాదంలోకి నెట్టే పరిస్థితి తలెత్తవచ్చని నిపుణులు అంచనా వేస్తున్న క్రమంలో ఇకనైనా ఈ చిల్లర రాజకీయాలు మాని అటు మేడిగడ్డ బ్యారేజీని, ఇటు మంజీరా బ్యారేజీని వెంటనే రిపేర్ చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై, కాంగ్రెస్ సర్కారుపై ఉందని కేటీఆర్ అన్నారు. బ్యారేజీల సామర్థ్యానికి మించిన వరద వచ్చిన సందర్భాల్లో ఆ ఒత్తిడిని తట్టుకోలేకే పిల్లర్లకు పగుళ్లు వచ్చినట్టు ఎస్డీఎస్ఓ గుర్తించింది. సరిగ్గా మేడిగడ్డ వద్ద కూడా ఊహించని వరద పోటెత్తడం వల్ల అక్కడ కూడా ఇదే తరహాలో పగుళ్లు ఏర్పడ్డాయి. కానీ దీన్ని అసెంబ్లీ ఎన్నికల వేళ భూతద్దంలో చూపించి అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ కుమ్మక్కై బీఆర్ఎస్‌పై బురదజల్లాయి. మేడిగడ్డ బ్యారేజీలోని రెండు పియర్స్‌కు వచ్చిన పగుళ్లపై నానాయాగీ చేసిన కాంగ్రెస్–బీజేపీ నేతలు మంజీరా బ్యారేజీ పిల్లర్లకు వచ్చిన పగుళ్లపై కనీసం స్పందించకపోవడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రాజెక్టులు, బ్యారేజీల్లో స్వల్ప రిపేర్లు వస్తే, అప్పటికప్పుడు వాటిని మరమ్మత్తు చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారే తప్ప కాళేశ్వరంపై కక్షగట్టినట్టు ఏ ప్రభుత్వాలు గతంలో వ్యవహరించలేదు. పరిపాలన చేతకాక కేవలం రాజకీయ కక్షసాధింపులతో కాలం వెల్లదీస్తున్న ఈ ముఖ్యమంత్రి మంజీరా, మేడిగడ్డ వంటి తాగు సాగునీటి బ్యారేజీలను రిపేర్లు చేయకుండా వదిలేస్తే, సీఎం రేవంత్‌ను, కాంగ్రెస్ సర్కారును చరిత్ర ఎప్పటికీ క్షమించదు అని కేటీఆర్ హెచ్చరించారు. చివరకు జై తెలంగాణ అని కేటీఆర్ నినదించారు.

## ఆదివాసీల సంక్షేమంలో రాజీలేదు మావోయిస్టుల లేఖపై స్పందించిన సీతక్క

మొదటిపేజీ తరువాయి

తన మూలాలను తానెప్పుడు మరిచి పోలేదన్నారు. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగులో మంత్రి సీతక్క విలేకర్లతో మాట్లాడుతూ.. జీవో 49ను తాను వ్యతిరేకించానని గుర్తు చేశారు. మంత్రిగా ఉండి తమ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యేలతో సమావేశం పెట్టానని వివరించారు. ఆ క్రమంలో కొందరు రాజకీయ నాయకుల ప్రోద్బలంతో ఒకరిద్దరు అటవీశాఖ అధికారులు తప్పా.. ఎవరూ ఆదివాసీల జోలికి వెళ్లడం లేదని మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. అయితే ఎవరు మాట్లాడినా నిజాలు మాట్లాడాలంటూ మావోయిస్టులకు ఆమె పరోక్షంగా సూచించారు. ఆదివాసీల వ్యవహారంపై శుక్రవారం ఉదయం మంత్రి సీతక్కకు మావోయిస్టులు లేఖ రాశారు. ఈ లేఖలో వారు ఏమన్నారంటే.. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా పని చేస్తున్న మాజీ మావోయిస్టు సీతక్క.. ఆదివాసీల హక్కుల గురించి కనీసం పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో ఆదివాసీల హక్కులకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్కదేనని స్పష్టం చేశారు. జీవో నెంబర్ 49తో కుమురం భీమ్ జిల్లాలోని 339 ఆదివాసీ గ్రామాలను ఖాళీ చేయించాలని ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. జీవో 49 కారణంగా రాష్ట్రంలో మూడు జిల్లాలు కనుమరుగవుతున్నాయంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు దోచిపె÷–టటెందుకే జీవో నెం. 49 తీసుకువచ్చారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఈ జీవోను వెంటనే రద్దు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాగా, ఈ లేఖపై మంత్రి సీతక్క వెంటనే స్పందించి వివరణ ఇచ్చారు.

## అంతర్జాతీయ ఆర్బిట్రేషన్‌కు భూ కేటాయింపులు రద్దు చేసిన హైకోర్టు

మొదటిపేజీ తరువాయి

ఐఏఎంసీకి భూమిని కేటాయించడాన్ని సవాల్ చేస్తూ రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. న్యాయవాది కె.రఘునాథ్‌రావు, వెంకటరామ్‌రెడ్డి దాఖలు చేసిన వ్యాజ్యాలపై జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ కె.సుజనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.ఈ పిటిషన్లపై జనవరిలో వాదనలు ముగిశాయి. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ సంస్థకు భూకేటాయింపు చేశారని న్యాయవాది రఘునాథ్ రావు కోర్టుకు తెలిపారు. ఐటీ కారిడార్‌లో రూ.350 కోట్ల విలువ చేసే భూమిని సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధంగా కేటాయించారని వాదించారు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్, మీడియేషన్ సెంటర్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేస్తే పలు అంతర్జాతీయ సంస్థల మధ్య వివాదాల పరిష్కారానికి దోహదపడుతుందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. వివాదాలు కేవలం న్యాయస్థానాల్లోనే కాకుండా.. బయట కూడా పరిష్కరించుకోవచ్చని న్యాయస్థానాలే చెబుతున్నాయన్నారు. ఐఏఎంసీ వల్ల వివాదాలు పరిష్కారమైతే కోర్టులపై కూడా భారం తగ్గుతుందన్నారు. ఇరువైపులా వాదనలు ముగియడంతో జనవరిలో తీర్పును రిజర్వు చేసిన హైకోర్టు శుక్రవారం వెలువరించింది. ఐఏఎంసీ భూకేటాయింపుతో పాటు, ప్రస్తుత భవనం నిర్వహణ కోసం జారీ చేసిన జీఓలను కూడా హైకోర్టు కొట్టేసింది.

## నేను ఫోన్ ట్యాపింగ్ బాధితుడ్ని..నన్ను విచారణకు పిలవండి: ఎంపీ రఘునందన్ రావు

మొదటిపేజీ తరువాయి

తాను అసలు ఫోన్ ట్యాపింగ్ బాధితుడినని, తనను విచారణకు పిలవకుంటా ఎవరెవరినో పిలుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేసును గాంధీ భవన్, జూబ్లీహిల్స్ మధ్య పంచాయతీలా మార్చారని, సిట్ కు చిత్తశుద్ధి లేదని విమర్శించారు రఘునందన్ రావు. బీజేపీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి కూడా తన ఫోన్ ట్యాపింగ్ కు గురైందన్నారు. పోలీసులు విచారణకు పిలిస్తే వాంగ్మూలం ఇస్తానని చెప్పారు.మరో వైపు ఇవాళ బీజేపీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సిట్ విచారణకు హాజరయ్యారు. జూబ్లీహిల్స్ పీఎస్ లో పోలీసులు ఆయనను ప్రశ్నించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆయన ఫోన్ ట్యాపింగ్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయన స్టేట్ మెంట్ ను రికార్డ్ చేశారు పోలీసులు.

2023 నవంబర్ 15 నుంచి నవంబర్ 30 వరకు భారీగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు దర్యాప్తు అధికారులు తేల్చిన సంగి తెలిసిందే. 4013 ఫోన్ నంబర్లను మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు అండ్ టీమ్ ట్యాపింగ్ చేసినట్లు తేలింది. ఫోన్ ట్యాపింగ్ బాధితులు 618 మంది ఉండగా.. ఇందులో పొలిటికల్ లీడర్లు కూడా ఉన్నారు.618 మందిలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ఐఏఎస్, ఐపీఎస్ , పారిశ్రామిక వేత్తలు, జర్నలిస్టులు కూడా ఉండటం గమనార్హం. రేవంత్ రెడ్డి ఆయన కుటుంబ సభ్యులు, బండి సంజయ్ కుటుంబ సభ్యులు, ఈటెల రాజేందర్ ఆయన కుటుంబ సభ్యులు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులతో పాటు అనుచరుల ఫోన్లు ట్యాప్ అయినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

## గోదావరి నదిపై ప్రాజెక్ట్ కడితే బనకచర్ల వివాదం ఉండేది కాదు: మంత్రి ఉత్తం

మొదటిపేజీ తరువాయి

ఇప్పటిదాకా మూడు సార్లు వచ్చి జాన్ పహాడ్ పనులను పరిశీలించామని.. పనులు వేగవంతం చేయకుంటే కాంట్రాక్టర్, చీఫ్ ఇంజనీర్ల మీద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు మంత్రి ఉత్తం. పనులు పూర్తి అయితే ఈ ప్రాంతం సస్య శ్యామలం అవుతుందని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల తెలంగాణ ప్రాంతం దెబ్బతిన్నదని అన్నారు ఉత్తం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత 281 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండిందని అన్నారు.రైతు భరోసా కింద తొమ్మిది వేల కోట్ల రూపాయలు మంజూరు చేసామని అన్నారు.

లక్షలు కోట్లు ఖర్చు పెట్టి కాళేశ్వరం కడితే కూలిపోయిందని.. ఇరిగేషన్ మీద పదహారు కోట్ల రూపాయలు అప్పు కడుతున్నామని అన్నారు ఉత్తం. హరీష్ రావు పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నాడని.. హరీష్ రావు జోసబ్ గోబెల్స్ రావు గా నామకరణం చేసుకోవాలని అన్నారు మంత్రి ఉత్తం.

## 142 మంది ఆటో కార్మికులు ఆత్మహత్యలు

మొదటిపేజీ తరువాయి

ఆటో కార్మికులు తమ ఆటోలు నడవక, బ్యాంకుల కిస్తీలు చెల్లించలేక ఆర్థికంగా కుదేలవుతున్నారని హరీశ్‌రావు అన్నారు. అయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆటో కార్మికులు తమ కుటుంబాల పోషణ భారంగా మారి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ వేదికగా కూడా ఆటో కార్మికుల పక్షాన బీఆర్ఎస్ మాట్లాడిందని గుర్తుచేశారు. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని, ఆటో కార్మికులకు కేసీఆర్ అండగా ఉంటారని హరీశ్‌రావు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల హామీలను అమలు చేసి, ఆటో కార్మికులకు భద్రత కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని అన్నారు. చనిపోయిన ఆటో కార్మికుల కుటుంబాలకు కనీసం రూ.10 లక్షల ఆర్థిక సాయం చేయాలని సూచించారు.

అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏడాది రూ.12 వేల చొప్పున రెండేళ్లుగా ఒక్కో ఆటో కార్మికుడికి బాకీపడిన రూ.24 వేలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

## హైదరాబాద్ లో ఒక్క నెలలోనే ఇన్ని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులా..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ లో జూన్ నెలకు సంబంధించి డ్రంక్ డ్రైవ్ కేసుల వివరాలు వెల్లడించారు పోలీసులు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో జూన్ నెలలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ లో సుమారు 3 వేల 353 మంది వాహనదారులు పట్టుబడ్డట్టు తెలిపారు పోలీసులు. పాత కేసులు కూడా కలుపుకొని జూన్ నెలలో 5 వేల 321 చార్జిషీట్లు దాఖలు చేసినట్లు తెలిపారు పోలీసులు. మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డవారిలో 133 మందికి జైలు శిక్ష కూడా పడినట్లు తెలిపారు.ఈ ఏడాది ఇప్పటిదాకా నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు గాను కోర్టు రూ. 1 కోటి 4 లక్షల 87 వేల 600 ఫైన్ విధించినట్లు తెలిపారు పోలీసులు. మద్యం సేవించి వాహనాలు నడిపితే సహించేది లేదని.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు పోలీసులు. హైదరాబాద్ సిటీలో ఎక్కడిక్కక్కడ డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహిస్తూన్నప్పటికీ కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. మద్యం సేవించి వాహనం నడపడం మంచిది కాదని... మీ ప్రాణాలు ప్రమాదంలో పడటమే కాకుండా కుటుంబాలు కూడా రోడ్డున పడే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు పోలీసులు.

## ఇందిరమ్మ ఇళ్ల విషయంలో దళితులకు అన్యాయం

మొదటిపేజీ తరువాయి

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ పార్టీతోపాటు కేసీఆర్ ఫొటో వాట్సాప్ స్టేటస్ పెట్టినందుకు బుధవారం మంత్రి వివేక్ నిర్వహించే కార్యక్రమంలో తనకు ఇవ్వాల్సిన ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్‌ను ఆపేసినట్టు మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లికి చెందిన నక్క సనా ? వేణు దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. గురువారం ఉదయం పోలంపల్లిలోని తమ గుడిసె ముందు మాట్లాడారు. ఎస్సీ మాదిగ అయినందునే వివక్ష చూపి ఇందిరమ్మ ఇంటి ప్రొసీడింగ్ ఇవ్వలేదని ఆరోపించారు. ఈ విషయమై ఎంపీడీవో కార్యాలయానికి వెళ్లి పంచాయతీ కార్యదర్శి సృజనను కలిస్తే.. మంత్రి పీఏ ప్రొసీడింగ్ ఆపేయమని చెప్పారని, బీఆర్ఎస్ స్టేటస్‌లు ఎందుకు పెడుతున్నారని పంచాయతీ కార్యదర్శి పేర్కొనడంతో వారు కంగుతిన్నారు. వాట్సాప్ స్టేటస్ పెట్టడం వల్లే మంత్రి పీఏకు ఫిర్యాదు వెళ్లిందని, అందుకే ప్రొసీడింగ్ ఇవ్వడం లేదని ఆమె తెలిపినట్టు వారు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అర్హులందరికీ ఇందిరమ్మ ఇవ్వాలని చెప్తున్నారని, ప్రజాపాలన అంటే ఇదేనా? అని వారు ప్రశ్నించారు. ప్రొసీడింగ్ ఇవ్వకపోతే ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం జూన్ 28 2025

## దివ్యాంగులకు వాకర్ స్టాండ్స్ అందజేసిన పల్లికొండ రాజేష్



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 27:**
రామగుండంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో జమీర్ వైన్డింగ్ షాపులో ఉపాధి పొందుతున్న దివ్యాంగులకు పల్లికొండ రాజేష్ కూతురు ప్రసన్నవల్లి జన్మదినం సందర్భంగా వాకర్ స్టాండ్స్ పలువురు పుర ప్రముఖుల మధ్య అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిజికల్ గా ఫిట్ గా ఉన్న వారినే పని పనిలోకి ఎలా పెట్టుకోవాలని ఆలోచించే ఈ రోజుల్లో నిస్సహాయులకు సహాయపడాలనే ఆలోచనతో జమీర్ దివ్యాంగులకు వైండింగ్ లో వర్క్ నేర్పించి ఉపాధి కల్పిస్తున్న వారి ఔదార్యాన్ని గుర్తించి జమీర్ కల్పిస్తున్న ఉపాధి మంచి సంకల్పంతో మొదలుపెట్టినదని, ఆయన వికలాంగుల పట్ల చూపిస్తున్న ఔదార్యాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లికొండ నరేష్ జెసి, మేడి రాజయ్య, గారే రవి, ధర్మాజీ రాజేష్, పల్లికొండ శంకర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ తండ్రి మృతి...

### - పలువురు నాయకుల పరామర్శ...

**కరపత్రం ప్రతినిధి పెద్దపల్లి జిల్లా జూన్ 27:**





రామగిరి మండలం రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు తండ్రి కొండు సత్యనారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఈ కార్యక్రమంలో రత్నాపూర్ మాజీ ఉపసర్పంచ్ దుబ్బాక సత్య రెడ్డి, మాజీ ఎంపీటీసీ ధర్మల రాజా సంపత్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణ, మాజీ కో ఆప్షన్ సభ్యులు వెగోళపు మల్లయ్య, తహసీల్దార్ బి.దత్తు ప్రసాద్ రావు,కొండు రవీందర్ రావు హెచ్.డీ కంపెనీ ఇంచార్జ్ లు హిరన్,భరత్, స్థానిక నాయకులు ఉనుగొండ శ్రీనివాస రావు ఓడ్నాల.రాధ కృష్ణా, తన్నీరు ప్రదీప్,మైలరం శ్రీనివాస్, కల్వచెర్ల శ్రీనివాస్ తదితరులు కరీంనగర్ లో వారి కుటుంబాన్ని పరామర్శించారు. అదేవిధంగా స్థానిక నాయకులు కొండు అంజన్న, ముదుసు నర్సయ్య,అంగూరి రమేష్,గుమ్మడి ప్రసాద్,పబ్బా వెంకటేష్,కనవేన వెంకటేష్,విష్ణు భక్తుల.వీర స్వామి,సోమారపు కనకయ్య పాల్గొన్నారు.

## రామగుండం ఏరియా -1లో చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సిలింగ్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 27:**
రామగుండం రీజియన్ లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు చేంజ్ ఆఫ్ క్వార్టర్ కౌన్సిలింగ్ ఆర్.సి.ఓ.ఏ క్లబ్ లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అర్.జి.1 యస్.ఓ.టు జిఎం గోపాల్ సింగ్ హాజరయి కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ క్వార్టర్ కౌన్సిలింగ్ లో డి, టి-2, ఎస్టి-2 టైప్ క్వార్టర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. క్వార్టర్లను సినియారిటి, అర్హత మరియు గ్రేడ్, పదవిని బట్టి క్వార్టర్ లను కేటాయించారు. మెత్తం 310 క్వార్టర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. క్వార్టర్ కౌన్సిలింగ్ ను పూర్తి పారదర్శకంగా కమిటి అధికారుల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు రంగు శ్రీను, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్ కుమార్, హనుమంత రావు, శ్రీనివాస్, సంక్షేమ అధికారి నాగరాజు, డిప్యూటి సూపర్డేంట్ వూట్ల దేవా చారి, సీనియర్ అసిస్టెంట్లు శ్రీనివాస్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోటో జర్నలిస్టు మహేశ్ మాతృమూర్తికి టీడబ్ల్యూజేఎఫ్ సంతాపం



**ఖమ్మం కరపత్రం ప్రతినిధి**
ఖమ్మం : ఫోటో జర్నలిస్టు, నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫోటోగ్రాఫర్ బండారి మహేష్ మాతృమూర్తి రమణమ్మకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా కమిటీ సంతాపం తెలిపింది. స్థానిక రేవతి సెంటర్ లో స్వగృహం వద్ద ఉంచిన రమణమ్మ మృతదేహాన్ని టీడబ్ల్యూజేఎఫ్ నేతలు శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి, జిల్లా బాధ్యులు సయ్యద్ ఖదీర్, దువ్వా సాగర్, మానుకొండ రవికిరణ్, షేక్ జానీపాషా తదితరులు ఉన్నారు.

# రామగుండంలో ప్రజాపాలన కాదు.. విధ్వంస పాలన సాగుతోంది...

- చిరు వ్యాపారులు దుకాణాలు ఎప్పుడు కుల్చుతారన్నా భయంతో బతుకుతున్నారు
- నూతన షాపుల కుల్చివేతల భాధ్యులపై చర్యలు తీసుకోవాలి
- బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి
- న్యాయం జరిగేంతా వరకు అండగా బిఆర్ఎస్ పార్టీ
- రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 27:**
రామగుండం నియోజకవర్గంలో ప్రజా పాలన అంటూ విధ్వంస పాలన చేస్తున్నారనీ... సుందరీకరణ అభివృద్ధి పేరిట చిరు వ్యాపారులు దుకాణాలు తొలగిస్తు వారి జీవనోపాధి లేకుండా చేస్తూ పెదవారి జీవితాలను కాంగ్రెస్ పాలకులు రోడ్డున పడవేస్తున్నరని రామగుండం మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదావరిఖని చౌరస్తా సమీపంలో రోడ్డు వెడల్పు, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో షాపులను కోల్పోయిన వారికి ప్రత్యాహ్నాయంగా కల్పించిన స్థలంలో ఆ షాపుల యజమానులు వేసుకున్న షెడ్లను సోమవారం మున్సిపల్ అధికారులు కూల్చివేయడంతో శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,




బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులతో కలిసి మున్సిపల్ అధికారులు కూల్చిన షెడ్లను పరిశీలించారు. సంబంధిత బాధితులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని చిరు వ్యాపారులంతా తమ దుకాణాలు మున్సిపల్ అధికారులు ఎప్పుడు కుల్చుతారో అన్న భయంతోబతుకుతున్నారని అన్నారు. దుకాణాలు కుల్చడం... కూల్చిన వాటిని నిర్మించడం మళ్ళీ వాటిని కూల్చడం ఇదేనా ప్రభుత్వ పని అని ప్రశ్నించారు. చిరు వ్యాపారులను షెడ్లను కూల్చిన విషయంలో ఎవ్వరు బాధ్యత వహిస్తారు... వీరికి ఎవ్వరు న్యాయం చేస్తారని ధ్వజమెత్తారు. దుకాణాలు ఎవ్వరు ఇక్కడ నిర్మించుకోమని చెప్పారు అని బాధితులను తాము అడుగగా, తమకు షాపింగ్ కాంప్లెక్స్ పూర్తి అయ్యేవరకు 6 నెలల పాటు ఇక్కడ షాపులు వేసుకోమని మహంకాళి స్వామి, ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్ చెప్పారని వారు తెలిపారని అన్నారు. వారు ఇక్కడ దుకాణాలు నిర్మాణం చేసుకోండి అని చెప్పడంతోనే దాదాపు లక్ష రూపాయల వరకు ఖర్చు చేసి షెడ్లను వేసుకున్నారని... దాదాపు నెల రోజులుగా ఇక్కడ నిర్మాణ పనులు జరుగుతుంటే మాట్లాడాని మున్సిపల్ అధికారులు దుకాణాలు పుర్తి అయ్యాకా అర్థంతరంగా వచ్చి షెడ్లను కూల్చడం ఎంటనీ ఆయన ప్రశ్నించారు. 12 మందికి జరిగిన నష్టానికి బాధ్యులేవ్వరని వారికి నష్టపరిహారం చెల్లించాలని సంబంధిత మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామగుండంలో కూల్చివేతల పాలన ఆపాలన్నారు. అనంతరం బాధితులతో కలిసి రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుల మూలంగా, కార్పొరేషన్ అధికారుల సమన్వయ లోపం కారణంగా నష్టపోయిన చిరు వ్యాపారులకు నష్ట పరిహారం ఇచ్చి, వారికి ప్రత్యామ్నాయంగా వ్యాపారాలు చేసుకోవడానికి స్థలం చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు గోపు ఐలయ్య యాదవ్, నారాయణదాసు మారుతి, జె.వి.రాజు కల్వచర్ల కృష్ణవేణి, ఐత శివ కుమార్, బోడ్డుపల్లి శ్రీనివాస్ అచ్చె వేణు తోట వేణు బొబ్బిలి సతీష్ దొమ్మేటి వాసు, సట్టు శ్రీనివాస్, బుర్ర వెంకన్న కొడి రామకృష్ణ కుమార్ నాయక్ ఆవునూరి వెంకటేష్ కిరణ్ జీ, తిమోతి, ఆడెపు శ్రీనివాస్, చింటూ తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ విద్యా సంస్థల పై విద్యాశాఖ విద్యాశాఖ కమీషనర్ పిర్యాదు చేసిన

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట జూన్ 27..**

- సామాజిక కార్యకర్త - గట్టు సాయిరాం
- విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కాకతీయ విద్యాసంస్థలు
- అమాయకులైన విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూన్న కాకతీయ విద్యా సంస్థలు
- పేరుకే పెద్ద విద్యాసంస్థ అందులో జరిగేవి అన్ని పెద్ద మోసాలు
- కాకతీయ బ్రిలియంట్ పాఠశాల అని పేరు పెట్టీ కృష్ణవేణి పాఠశాలలో అడ్మిషన్లు నమోదు చేస్తున్నారు
- కాకతీయ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తున్న విద్యాధికారులు
- ఒకటి కాదు రెండు కాదు మొత్తం 698 అడ్మిషన్లతో మోసం
- లాభార్జనే ధ్యేయంగా తమకు నచ్చిన రీతిలో నడుస్తున్న కాకతీయ విద్యా సంస్థలు
- కాకతీయ బ్రిలియంట్ పాఠశాలకు పర్మిషన్ పత్రాలు వచ్చేదాకా పాఠశాల మూసివేయాలి






జమ్మికుంట పట్టణంలో కృష్ణవేణి విద్య సంస్థ పేరు మీద కాకతీయ బ్రిలియంట్ విద్యాసంస్థ నడుస్తుంది అని అనేక సార్లు విద్యాధికారుల దగ్గరకి పోయిన కూడా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. అంతే కాకుండా ఒక పక్క ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చెయ్యాలని చూస్తుంటే మరోపక్క ప్రైవేట్ పాఠశాలకు కొమ్ముకస్తున్న ప్రభుత్వ అధికారులు .ఈ విషయం పై గత 2024 - 2025 సంవత్సరంకి గాను మొత్తం 698 అడ్మిషన్లు యు డయాస్ ప్రభుత్వ ఆమోదిత వెబ్ సైట్ లో కృష్ణవేణి పాఠశాల పేరు మీద ఉన్నాయి అయిన కూడా మమ్మల్ని అడిగేవారు లేరని ఈ సంవత్సరం అనగా 2025 - 2026 సంవత్సరం కూడా అదే పాఠశాల అనగా కృష్ణవేణి లో అడ్మిషన్లు నమోదు అయి ఉన్నాయి కానీ పాఠశాల బోర్డు లు పాఠశాల విద్యార్థుల దుస్తులు వ్యాన్లు మొత్తం కాకతీయ బ్రిలియంట్ పాఠశాల అని ఉన్నాయి ఇంత పెద్ద దోపిడి మరియు ప్రజా ధనాన్ని విద్యార్థుల పేరుతో అమాయకులైన తల్లిదండ్రుల నుండి దోచుకుంటున్నారు ఇంత పెద్ద దోపిడి మోసం జరుగుతుంది అని ఆ యొక్క పాఠశాల పై పలు మార్లు ఉన్నత అధికారులు అయిన జిల్లా కలెక్టర్ కు జిల్లా విద్యాధికారి కి స్థానిక ఎంఈఓ కు పిర్యాదులు చేసిన ఆ యొక్క పిర్యాదులు చెత్త బుట్టలకే పరిమితం అవుతున్నాయి తప్పా చర్యలు తీసుకునే అవకాశం లేదు ఈ విషయం పై తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కు అన్ని పూర్తి సాక్ష్యాధారాలతో పిర్యాదు చెయ్యడం జరిగింది . వెంటనే ఆ యొక్క పాఠశాలపై చట్ట పరమైన చర్యలు తీసుకొని ఆ యొక్క పాఠశాలను సీజ్ చేసి విద్యార్థులను మోసం చేసిన కాకతీయ విద్యాసంస్థల యాజమాన్యం పై వారికి కొమ్ము కాస్తున్న అధికారులపై చీటింగ్ కేసులు నమోదు చెయ్యాలని కోరుతున్నాను ఈ విషయం పై త్వరలో జమ్మికుంట పోలీస్ స్టేషన్ లో పూర్తి ఆధారాలతో కేసు పెడతామని తెలియజేస్తున్నాము

# బొల్లారంలో అంగరంగ వైభవంగా పూరి జగన్నాథుడి రథయాత్ర..

-రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్
-వేల సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
-అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నాం
-ఎమ్మెల్యే జిఎంఆర్





**కరపత్రం ప్రతినిధి సంగారెడ్డి**
పూరి జగన్నాథుడి విశ్వ ప్రసిద్ధ రథయాత్రను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలో గల జగన్నాథుని ఆలయంలో నిర్వహించిన రథయాత్ర కార్యక్రమానికి పోనిక పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన రథయాత్ర కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించడంతో వేలాది భక్తుల జయ జయధ్వనుల మధ్య రథయాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ మినీ ఇండియాగా పేరుందిన బొల్లారం మున్సిపాలిటీలోని అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకొని చూసుకుంటున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తూ వారి ఆర్థిక అభ్యున్నతికి పాటుపడుతున్నమన్నారు. పూరి జగన్నాథుడి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్టు ఆయన తెలిపారు. అన్ని వర్గాల ప్రజల పండుగలను సమ ప్రాధాన్యతతో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు హనుమంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శనివారం జూన్ 28 2025

# జులై 3,4 తేదీల్లో విద్యా సంస్థల 48 గంటల బంద్...

**– జార్జిరెడ్డి పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు నరేష్ రత్న:**

**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**




ఇంజనీరింగ్, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ విద్యా సంస్థల 48 గంటల బంద్ (జూలై 3,4) న నిర్వహిస్తున్నట్లు జార్జి రెడ్డి పి.డి.ఎస్.యూ పెద్దపల్లి అధ్యక్షులు నరేష్ రత్న, జిల్లా నాయకులు శివ,రమేష్,సాయి చరణ్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంగా పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... విద్యారంగం పై ప్రభుత్వ వివక్ష కారణంగా రాష్ట్రంలో సుమారు 8000 వేల కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ నిధులు పెండింగ్ లో ఉన్నాయని అన్నారు. గత కొన్ని నెలలుగా విద్యార్థి సంఘాలు, విద్యార్థులు అనేక రూపాలలో విజ్ఞప్తులు ఇచ్చిన ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య, వివక్ష చర్యల మూలంగా విద్యార్థులు వారి తల్లి తండ్రులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలిన ప్రభుత్వ తీరును నిరసిస్తూ, తక్షణమే పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జూలై 3,4 తేదీలలో 48 గంటల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మక పథకంగా ప్రచారం చేసుకుంటున్న ఓవర్సీస్ విద్యార్థుల స్కాలర్షిప్ బకాయిలు కూడా విడుదల చేయలేదని అన్నారు. రాష్ట్రంలో ఇంజనీరింగ్ కళాశాలలలో అశాస్త్రీయంగా పెంచిన ఫీజులు పెంచారని, దీని వలన విద్యార్థులపై తీవ్ర భారం పడిందని అన్నారు. తెలంగాణలో అనేక ఇంజనీరింగ్ కళాశాలలో నిబంధనలకు విరుద్ధంగా డొనేషన్ల పేరుతో లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారనీ, అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని మండి పడ్డారు. డొనేషన్ల దందా చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాల పై స్పెషల్ విజిలెన్స్ బృందాలతో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. మరివైపు ప్రభుత్వ విద్యా సంస్థల్లో, వసతి గృహాలలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, మంత్రులు, ప్రభుత్వ పెద్దలు మాత్రం చోద్యం చూస్తున్నారని అన్నారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని, విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థి ఆగ్రహానికి గురి కావలసి ఉంటుందని హెచ్చరించారు.ఖమ్మం జిల్లా కేంద్రంగా ప్రభుత్వ జనరల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని దాదాపు 2 దశాబ్దాలుగా విద్యార్థులు అనేక రూపాల్లో పోరాటాలు,మేధావులు,ప్రజాస్వామిక వాదులు, కోరుకుంటున్నారనీ ,వివిధ రూపాల విన్నపాలు చేశారనీ ,ఈ జిల్లా పర్యటన కు వచ్చిన నలుగురు ముఖ్యమంత్రులు జిల్లాకు యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం అని హామీ ఇచ్చి కాలయాపన చేస్తున్నారనీ ,ప్రస్తుతం ఖమ్మం జిల్లా నుండి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహించిన కమిషన్ కక్కుర్తి పనులు తప్ప విద్యా వ్యవస్థను బొంద పెడుతున్నారనీ ,తక్షణమే యూనివర్సిటీ ఏర్పాటు కు కృషి చేయకపోతే మంత్రులను ఎక్కడకు అక్కడ అడ్డుకోవడానికి కూడా వెనకడమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జార్జిరెడ్డి పి.డి.ఎస్.యూ నాయకత్వం నరేష్, రమేష్ ,శివ,చరణ్,సాయిశరణ్, శ్రీకాంత్ ,రాజు,మహేష్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ.

**కరపత్రం ప్రతినిధి వీణవంక జూన్ 27**





కరీంనగర్ జిల్లా, వీణవంక మండలం, మల్లారెడ్డిపల్లి గ్రామంలో గల పెద్దమ్మ తల్లి దేవాలయంలో ప్రతి శుక్రవారం దాతల సహకారంతో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ వారం 19 వ శుక్రవారం అన్న ప్రసాద వితరణ చేసినవారు.సింగతి సరోజన భర్త శ్రీనివాస్ గ్రామం:మల్లారెడ్డిపల్లి, మండలం: వీణవంక,జిల్లా: కరీంనగర్. ఈ సందర్భంగా ఆలయ కమిటి చైర్మన్ గోనెల సమ్మన్న ముదిరాజ్ మాట్లాడుతూ ఇక్కడ స్వయంభూ వెలసిన శ్రీ పెద్దమ్మతల్లి భక్తుల కోరిన కోరికలు తీర్చే ఇలవేల్పుగా కొలువబడుతుంది. పర్యావరణాన్ని రక్షించే దిశగా ఇక్కడ ఎలాంటి పేపర్ ప్లేట్లు గాని, డిస్పోజల్ గ్లాసులు గాని వాడకుండా మోదుగాకుల ఇస్తార్లలో భోజనం వడ్డిస్తూ పర్యావరణాన్ని రక్షిస్తున్నామని తెలియజేశారు. ఈ చక్కటి కార్యక్రమానికి దాతలు ముందుకు వచ్చి మాకు సహకరించాలని కోరినారు.అనంతరం గణేష్ కళాబృందం వారి ఆధ్వర్యంలో రాత్రి 8 గంటల నుండి 10 గంటల వరకు భజన కార్యక్రమం నిర్వహిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్ ,గణేష్ కళాబృందం అధ్యక్షులు గోనెల పెద్దన్న ముదిరాజ్, అమ్మ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు కొలిపాక రామస్వామి,సభ్యులు బండారి సందీప్,కొలిపాకఎల్లయ్య,యక్షగాన కళాకారుడు కర్రె స్వామి యాదవ్,కర్రెలచ్చయ్య,పూదరి సంపూర్ణ,గోనెల స్వరూప,సింగతి స్వరూప పాల్గొన్నారు.

# ఉద్యమకారుల శాంతియుత దీక్షలకు సంఘీభావం తెలుపుదాం



**– రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి**

**కరపత్రం ప్రతినిధి వేములవాడ జూన్ 27**

తేదీ 27- 6- 2025 శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు ఉద్యమకళాకారుల ప్రధాన కార్యాలయం వేములవాడ నందు జరిగిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ కళాతపస్వి యెల్ల పోశెట్టి మాట్లాడుతూ తేదీ 30- 6-20 25 సోమవారం రోజున ఉదయం 10 గంటలనుండి సాయంత్రం 5: గంటల వరకు జరుగు ( టీ యూ ఎఫ్ )రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల శాంతియుత దీక్షలకు 33 జిల్లాలోని కళాఉద్యమకారుల అధ్యక్షులు కన్వీనర్లు కోఆర్డినేటర్లు మండల అధ్యక్షులు కన్వీనర్లు కోఆర్డినేటర్లు మహిళా కళాకారుణీలు,అధ్యక్షురాల్లు కన్వీనర్లు కమిటీ సభ్యులు అందరూ కలిసి మీ యొక్క జిల్లాలలోని మరియు నియోజకవర్గంలోని మండల కేంద్రంలోని గ్రామస్థాయిలోని ఉద్యమకారుల శాంతియుత దీక్షల శిబిరాల వద్దకు చేరుకొని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలియజేస్తూ ఉద్యమ కళాకారులందరూ సంఘీభావం ప్రకటించాలని కోరుతున్నాము ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ కోఆర్డినేటర్ బొడ్డు రాములు, రాజన్న సిరిసిల్ల జిల్లా ఉపాఅధ్యక్షులు కనపర్తి హనుమాన్లు, బుర్రి శంకరయ్య వీర్నపల్లి మండల అధ్యక్షులు నేరెళ్ల ముత్యం గౌడ్ చందుర్తి మండల అధ్యక్షులు దొంగరి లక్ష్మిరాజం ఉపాధ్యక్షులు పుల్కం లచ్చయ్య భూత అంజయ్య చిదుర నాగరాజు వివిధ మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు

# ప్రభుత్వ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలి

**– విద్యా వ్యాపారం చేస్తు తల్లి దండ్రులను ఇబ్బందులు పెడితే ఊరుకోం.. ఏఐఎస్ఎఫ్**
**– ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు వెంకటేష్**

**కరపత్రం ప్రతినిధి హుజురాబాద్ జూన్ 27**





హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మౌలిక వసతులు కల్పించాలని, మధ్యాహ్నం భోజనం పథకం అమలు చేయాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ అన్నారు. శుక్రవారం అఖిల భారత విద్యార్థి సమైక్య జిల్లా అధ్యక్షుని ఆధ్వర్యంలో హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలనుసందర్శించి, విద్యార్థుల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మండల కార్యదర్శి రాంపెల్లి రోహిత్ అధ్యక్షతన ఏఐఎస్ఎఫ్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక మండల కేంద్రంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారపు వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలను అభివృద్ధి పరిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో సైన్స్ విద్యార్థులకు ల్యాబ్స్, ఆధునిక టెక్నాలజీకి అనుగుణంగా కంప్యూటర్స్ లాంటి పరికరాలను అందుబాటులో ఉంచి నాణ్యమైన విద్య అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోని ప్రైవేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.
విద్యార్థులు లేరనే సాకుతో ప్రభుత్వం 12ఎస్సీ గురుకుల ఇంటర్ కళాశాలలను మూసివేసే నిర్ణయాన్ని మానుకోవాలన్నారు.హుజురాబాద్ లో ఉన్నటువంటి ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ పాఠశాలల వ్యాపార కేంద్రాలుగా మారాయని తమ వద్దనే వస్తువులు కొనాలని పాఠ్యపుస్తకాలు యూనిఫామ్ టైం బెల్ట్ ఇతర వస్తువులు పోతున్నాయని విద్యార్థులను తల్లిదండ్రులను ఒత్తిళ్లకు గురిచేస్తున్నాయని విద్యాశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు రాహుల్, గణేష్, పృథ్వీ, శ్రీకాంత్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న

**– మన వంతుగా ప్రతి పేదవాడికి ఒక్కపూటైనా భోజనం అందేలా చూద్దాం**







**కరపత్రం ప్రతినిధి వేములవాడ జూన్ 27**

మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1526 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో శుక్రవారం రోజున లక్ష్మీ గణపతి కాంప్లెక్స్ రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు, అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్నదాతలుగా రాపెల్లి రఘుపతి, రాపెల్లి వేణుగోపాల్ పుష్పలత దంపతులు, రాపెల్లి శ్రీధర్ లావణ్య దంపతులు, గోపు బాలరాజు గోపు మల్లేశం కుటుంబ సభ్యులు శాశ్వత దాతలుగా జువ్వాడి వెంకటేశ్వరరావు స్నేహాలత దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్ జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్ చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని పేదలకు అన్నదాన కార్యక్రమానికి సహకారం అందించాలను కునే దాతలు ట్రస్టు సభ్యులను సంప్రదించా లని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు.నేటి అన్నదాన కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వొడ్యాల వేణు, నాగుల చంద్రశేఖర్, పొలాస రాజేందర్, గొండ ప్రసాద్, పసుల శ్రీనివాస్, సగ్గు రాహుల్ పాల్గొన్నారు

# ప్రజా జీవనానికి భంగం కలిగేలా ప్రవర్తించిన యువకులు

**– తల్లితండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్**
**– సత్ప్రవర్తనకై యువకుల బైండోవర్**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 27:**




గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ విఠల్ నగర్ లో కొంతమంది యువకులు కలిసి స్నేహితునీ పుట్టినరోజు వేడుకలు ఇంట్లో జరుపుకొనే క్రమంలో స్నేహితుల మధ్య మాట మాట పెరిగి వాగ్వాదం జరిగి ఇంట్లో నుండి గుంపుగా బయటకు వచ్చి రోడ్డు పైన బూతులు మాట్లాడుకుంటూ ప్రజా జీవనానికి భంగం కలిగే విధంగా ప్రవర్తించారు. సంఘటనకు సంబందించిన సమాచారం పోలీస్ వారికీ రాగా వెంటనే వారిని, వారి తల్లితండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. వారి తల్లితండ్రులు కూడా భవిష్యత్తు లో తమ పిల్లలు ఎలాంటి చెడు ప్రవర్తనలు చెయకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. నేరా నియంత్రణ, సత్ప్రవర్తనకై ముందస్తు చర్యలలో భాగంగా ఒక సంవత్సరం వరకు ఎలాంటి చెడు ప్రవర్తన చేయకుండా తహశీల్దార్ ముందు బైండొవర్ చేయడం జరిగిందని సీఐ తెలిపారు. గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ తరుపున ప్రజలను, తల్లితండ్రులకు సూచన తమ పిల్లల ప్రవర్తనను, వారి కదలికలను ఎల్లప్పుడూ గమనిస్తూ ఉండాలని, వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు వారి స్నేహితుల ప్రవర్తనలు, అలవాటుల గురించి, తెలుసుకోవాలి అన్నారు. ఎవరైనా పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజా జీవనానికి, ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తిస్తే వెంటనే స్థానిక పోలీస్ వారికీ సమాచారం అందించాలని, పోలీస్ ఎల్లప్పుడూ ప్రజా భద్రత, రక్షణకు అందుబాటులో ఉంటుందని చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలు పాల్పడితే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని వన్ టౌన్ ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.